క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబుకు పెన్షన్ అందజేస్తున్న వెంకటలక్ష్మి

దెంకాడ: విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని వెదుళ్లవలస పంచాయతీ, గొడిపాలెం గ్రామానికి చెందిన మైనపు రాంబాబుకు వలంటీర్ వెంకటలక్ష్మి శుక్రవారం పెన్షన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ ఇవ్వడాన్ని అందరూ అభినందిస్తున్నారు.

శిక్షణ నైపుణ్యాలతో ఉపాధి

- జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ


మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ

విజయనగరం అర్బన్: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి పొందాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ సూచించారు. స్థానిక ఆర్కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో శుక్రవారం జరిగిన అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాబార్డు సహకారంతో రెండు నెలల శిక్షణలో పొందిన నైపుణ్యాలతో ఉద్యోగాల సాధనతో పాటు స్వయం ఉపాధి పొందాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్, అసోసియేట్ మేనేజర్ సీహెచ్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి కె.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని, ఆలయ ప్రధానార్చకులు పి.వి.జె.చాణక్య, జి.ఎస్.హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 3వ తేదీన జరగనున్న జాతీయ ఉపకార వేతన ప్రతిభా పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో బి.లింగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లోని స్కూల్ లాగిన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి, లాగిన్ అయి హాల్ టికెట్‌ను సంబంధిత విద్యార్థికి అందజేయాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, సక్రమంగా సేవలందించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మలిచర్ల గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. 11 విభాగాలకు చెందిన సిబ్బంది గ్రామాల్లోనే 540కి పైగా సేవలు సచివాలయాల్లో అందించడం జరుగుతోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే సమయాల్లో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేస్తే అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలన సమయాల్లో తెలుసుకునే వీలుంటుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు


విజయనగరం: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు వేణు తదితరులు

విజయనగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అటువంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అన్నారు. నగరంలోని 26, 29, 41, 49వ డివిజన్‌లలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 49వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా అందరం కృషి చేయాలని కోరారు. అంతకుముందు పార్టీ జెండా, ప్రభుత్వ పథకాల బోర్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని జొన్నాడ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తొలుత సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఇక్కడి సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు మొత్తం రూ.24,37,44,942 అందించిందన్నారు. రాష్ట్రం బాగుండాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జొన్నాడ, ఆకులపేట సర్పంచ్‌లు కోరాడ రమణి, సువ్వాడ రమేష్, ఎంపీటీసీ త్రిపురగిరి దేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గుంపాం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, కాసేపు మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందించడం జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోట్ల రఘు, ఎంపీడీవో ఎం.రాధిక, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: గుంపాంలో ప్రభుత్వ పథకాల బోర్డు ప్రారంభిస్తున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు


నెల్లిమర్ల: ప్రభుత్వ పథకాల బోర్డు వద్ద ఎంపీపీ సుధారాణి, జెడ్పీటీసీ సన్యాసినాయుడు


ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, వైస్ ఎంపీపీ తమ్మునాయుడు

భోగాపురం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, అటువంటి నేతకు మనమంతా అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రపేట సచివాలయం వద్ద జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తొలుత ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఆ తర్వాత ఆయన ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం చేసిన ఖర్చును వివరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.మురళీమోహనరావు, ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


భోగాపురం: రామచంద్రపేట సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

నెల్లిమర్ల: మండలంలోని జోగిరాజుపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు తొలుత వైఎస్సార్ సీపీ జెండా, ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమం మన రాష్ట్రంలో జరుగుతోందన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అన్ని ప్రాంతాలు బాగుపడేలా చేస్తున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటర్ల నమోదు

- నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు

విజయనగరం: అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచేయడంతో పాటు 18 ఏళ్లు నిండిన యువతీయువకుల నుంచి కొత్త ఓటరు దరఖాస్తులు స్వీకరించి, ఓటరు నమోదు చేస్తారన్నారు. అర్హులై వారంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలన్నారు.

భోగాపురం: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

విజయనగరం: మానవతా స్వచ్ఛంద సాంఘీక సేవా సమితి విజయనగరం శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఈ ఎన్నికలో సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన కొత్త కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా కె.ఆర్.కె.రాజు, కో–చైర్మన్‌గా టి.ఎల్.ఎన్.మూర్తి, డైరెక్టర్‌గా టి.ప్రసాద్ పట్నాయక్, అధ్యక్షుడిగా భోగరాజు సూర్యలక్ష్మి, కార్యదర్శిగా భేరి రాధికారాణి, కోశాధికారిగా రెయ్యి శంకరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నాగేశ్వరరావు, సూర్యనారాయణ, గోపి, అప్పారావు ఎన్నికయ్యారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్లు జానకిరామరాజు, రాధా, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


ఉపాధ్యాయుడు కేవీఎస్ ప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి

విజయనగరం రూరల్: సమాజానికి భవిష్యత్ తరాలను అందించే ఉపాధ్యాయవృత్తి ఎంతో గౌరవప్రదమైనదని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. కోరుకొండ సైనిక పాఠశాలలో 37 ఏళ్లుగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న కేవీఎస్ ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా సైనిక పాఠశాలలోని పీవీజీ రాజు ఆడిటోరియంలో శుక్రవారం ఆయనకు వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయ వృత్తి ద్వారా ఎంతో మంది భావి భారత పౌరులను ఉన్నతులుగా తీర్చిదిద్దే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకపాత్ర వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎన్నో అవార్డులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కేవీఎస్ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో హెచ్ఐవీ దూరం


జెండా ఊపి, ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ మయూర్ అశోక్

- జేసీ మయూర్ అశోక్

విజయనగరం ఫోర్ట్: అవగాహనతో మెలిగితే హెచ్ఐవీకి దూరంగా ఉండొచ్చని జేసీ మయూర్ అశోక్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అవగాహన ర్యాలీ ప్రారంభించారు. మయూరి జంక్షన్, ఆర్అండ్‌బీ రైతుబజారు మీదుగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొని, ఎయిడ్స్ నివారణ దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. అలాగే వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా వ్యాధిని గుర్తించి, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే ఎయిడ్స్ ప్రాణాంతకం కాదన్నారు. జిల్లాలో ఎస్.కోట, బొబ్బిలి, రాజాం ప్రాంతాల్లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారని, ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు సంఖ్య తక్కువేనన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.సూర్యనారాయణ, డీపీఎం బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం


భోగాపురం: సుందరపేట సీహెచ్‌సీ వద్ద ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



విజయనగరం రూరల్: ద్వారపూడి గ్రామంలో ర్యాలీలో రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు

ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని, వాడవాడలా ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వ్యాధి ప్రబలే విధానాలు, నివారణా మార్గాలను వివరించారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని, అవగాహనతోనే వ్యాధి నిర్మూలన సాధ్యమని తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్.


విజయనగరం ఫోర్ట్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం


నెల్లిమర్ల: ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది


విజయనగరం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జనార్దన్‌నాయుడు


పూసపాటిరేగ: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది



విజయనగరం ఫోర్ట్: ఎయిడ్స్ నిర్మూలనకు పిలుపునిస్తున్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసునందని

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన


ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు తదితరులు

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిల్లపేట గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరికొద్దిరోజుల్లోనే చిల్లపేట, దుప్పాడ రోడ్ల మరమ్మతులు పూర్తి చేయడం జరుగుతుందని, వీటికి సంబంధించి, నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న అభిమతమని, ఆయన ఆ దిశగా అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజల బాగోగుల కోసం పరితపించే జగనన్నను మరోసారి ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు కె.త్రినాథ్, జి.వెంకటరావు, ఈవోపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.